


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## బైక్ , కారు ఢీ : వ్యక్తిమృతి

**మర్రిపాడు, జులై21, ప్రభాతవార్త :** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై మర్రిపాడు మండలం అచ్చమాంబ గుడి సమీపంలో ఆదివారం బైక్, కారు ఢీకొని వ్యక్తి మృతి చెందారు. బైక్ పై ప్రయాణిస్తున్న కండ్రికకు చెందిన కుంకు తిరుపతయ్య(35)ను కారు ఢీకొ ంది. ప్రమాదంలో తిరుపతయ్య కాలు తెగిపోయి తీవ్ర గాయాలు కాగా చికిత్స కై ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తీవ్ర రక్తస్రావం కావడంతో తిరుపతయ్య మృతిచెందాడు. కండ్రిక గ్రామ ప్రాధమికోన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్‌గా తిరుపతయ్య బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# విజయవంతంగా ముగిసిన రొట్టెల పండుగ



ఐదు రోజుల్లో సుమారు 10లక్షలపైగా విచ్చేసిన భక్తులు
విస్తృతమైన ఏర్పాట్లతో భక్తుల సంతృప్తి
పారిశుధ్య కార్మికుల సేవలకు భక్తుల సలాం
నిరంతరం వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బంది
పోలీసు కంట్రోల్ రూం సేవలు భేష్
ప్రజాప్రతినిధులు, అధికారులు పనితీరుకు ప్రశంసలు

**నెల్లూరు అర్బన్, జులై 21, ప్రభాతవవార్త :** నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఐదు రోజుల పాటు నిర్వహించిన రొట్టెల పండుగ విజయవంతంగా ముగిసింది. ఈ నెల 17న మొదలైన పండుగ 21వ తేది ఆదివారం వరకు ఘనంగా జరిగింది. ఈ ఐదు రోజుల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారు. శనివారం, ఆదివారం వర్గంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసి సేధుమాధవన్, మున్సిపల్ అడిష నల్ కమిషనర్ శర్మద, వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్య లు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. పండుగకు ముందు నుంచే మంత్రులు నారాయణ, ఆనం రా మనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించడం సమర్ధవంతం గా పనిచేసే దర్గా కమిటీ చైర్మన్ ఖాధర్ భాష, కమిటీ సభ్యులను నియమించి నిరంతరం పర్యవేక్షిం చడం రొట్టెల పండుగ విజయవంతం కావడానికి ప్రధాన కారణాలు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. జిల్లా యంత్రాంగం పటిష్టంగా చేపట్టిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**పోలీసు కంట్రోల్ రూం సేవలు భేష్ :** దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీస్ కంట్రోల్ రూం 24 గంటలూ అనౌన్స్మెంట్ చేస్తూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు. ఈ మూడు రోజుల్లో సుమారు 500 మందికి పైగా తప్పిపోయిన వారిని గుర్తించి వారి సంబంధికులను అప్పగించారు. దీంతో పోలీసు కంట్రోల్ రూం సేవలను అందరూ శభాష్ అని మెచ్చుకున్నారు.

**24 గంటలు పనిచేసిన పారిశుధ్య కార్మికులు**

**ఎటుచూసినా పరిశుభ్రతకు పెద్దపీట :** దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించగా 5000 మందికి పైగా సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పనిచేశారు. దర్గాలో ఏ రోడ్డు చూసినా పరిశుభ్రంగా కనిపించాయి. దర్గా ఆవరణంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించడానికి వాహనాలు నిరంతరం పనిచేసారు. దర్గాలో ఏ రోడ్డు చూసినా పరిశుభ్రంగా కనిపించాయి. దర్గా ఆవరణంలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించడానికి వాహనాలు నిరంతరం పనిచేసాయి. మరుగుదొడ్ల వద్ద ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యర్థాలను సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా తరలించారు. స్నానపు గదులు సామూహిక మరుగుదొడ్లు, ఘాట్ పరిసర ప్రాంతాలను అనునిత్యం బ్లీచింగ్, ఫినాయిల్ చల్లుతూ పరిశ్రుభంగా ఉండేలా కార్మికులు చురుగ్గా పనిచేశారు. దర్గాకు విచ్చేసిన వివిధ ప్రాంతాల భక్తులు పారిశుధ్య కార్మికుల శ్రమకు సలాం చేశారు.

**వైద్య శిభిరాలను వినియోగించుకున్న భక్తులు :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడు తున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్‌ల వారీగా నియమించి 24 గంటలు భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మూడు రోజు సుమారు 5000 మంది పైగా భక్తులకు బిపి, రక్తపరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య తెలిపారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ :** స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. 24 గంటలు అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచి ఐదు రోజులు అప్రమత్తంగా వుంటూ పనిచేశారు.

**భక్తులందరికీ అన్నదానం..** రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుం డా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో నాలుగు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందించారు. ఐదు రోజుల్లో సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు.





## వేడుకగా గురుపౌర్ణమి వేడుకలు



**సంగం జులై 21 ప్రభాతవార్త :** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలోని శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాలు గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, కుటుంబసభ్యుల నేతృత్వంలో నిర్వహించారు. స్వామి వారికి ఉదయం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మద్యహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కావలి-తెట్టు మధ్య నాగోన్ ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

### బెంబేలెత్తిన ప్రయాణికులు...అప్రమత్తమైన లోకో పైలెట్




**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి-తెట్టు మధ్య అడవిరాజుపాళెం రైల్వే గేటు సమీపంలో నాగోన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం ఉన్నపళంగా పొగలు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. రైలు బోగీలో పొగలు రావడంతో లోకోపైలెట్ అప్రమత్తమయ్యారు. బ్రేక్‌డౌన్ కావడంతో పొగలు వచ్చినట్లు పైలెట్ గమనించారు. ఒక్కసారిగా రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు భయాందోళనతో రైలు నుంచి దిగిపోయారు. దాదాపు 20 నిమిషాల పాటు నాగోన్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. చిన్నపాటి మరమ్మతులు చేయడంతో యధావిధిగా రైలు బయలుదేరింది. అస్సాం రాష్ట్రంలోని సిల్గాట్ టౌన్ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని తాంబరంకు వెళ్తున్న ఈ రైలులో ఆకస్మికంగా పొగలు చోటుచేసుకున్నాయి. కావలి సమీపంలోని ఎల్‌సి గేటు 161 వద్ద రైలులో నుంచి పొగలు సంభవించాయి. ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో రైల్వే అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

## కుటుంబ సమేతంగా దర్గాను దర్శించుకున్న రూరల్ ఎమ్మెల్యే



**నెల్లూరు అర్బన్, జులై 21, ప్రభాతవార్త :** నెల్లూరు బారాషహిద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బారాషహీద్‌లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వర్ణాల చెరువులో రొట్టెను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పట్టుకున్నారు.

## ఇలియాస్‌కు ఆర్థిక సాయం అందజేసిన జూపల్లి మిత్రబృందం




**వింజమూరు, జులై21, ప్రభాతవార్త :** రెక్కాడితేకాని డొక్కాడని కుటుంబం జీవనాధారం కోసం కూలిపనికి వెళితే అనుకోని ప్రమాదం వెంటాడి ఆ కుటుంబాన్ని ఆవేదనకు గురిచేసింది. వింజమూరు పంచాయతీ పరిధిలోని సుజాతనగర్ కాలనీకి చెందిన ఇమ్రాన్ కుమారుడు ఇలియాస్ తన కుటుంబ పోషణ కోసం పట్టణంలోని అద్దాలు దింపే పనికి వెళుతున్నాడు. ప్రమాదవశాత్తు అద్దం దించుతున్న సమయంలో అద్దం పగిలి గొంతులోకి దిగడంతో స్థానిక ప్రవేటు వైద్యశాలలో ప్రధమచికిత్స అనంతరం చెన్నైకి తరలించారు. అక్కడ లక్షల్లో వైద్య ఖర్చులవుతాయని తెలియడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ పలువురిని ఆర్థికసాయం కోరారు. విషయం తెలుసుకున్న సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్ , షేక్ రసూల్, కొండపల్లి రమేష్, చంద్ర, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, గంగి శ్రీనివాసులు, ఇతర మిత్ర బృందం 39వేల రూపాయలను ఇలియాస్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

## ఘనంగా చెన్నకేశవస్వామి గరుడ మహోత్సవం



**నెల్లూరు రూరల్, జులై 21, ప్రభాతవవార్త ;** నెల్లూరు 12వ డివిజన్ చింతారెడ్డిపాలెంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వారి గరుడు మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. మొదటి రోజు గ్రామదేవత సోమాలమ్మకు పొంగళ్ల నైవేధ్య కార్యక్రమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రెండవ రోజు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే శ్రీ మస్తాన్ వలీ ఉరుసు ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఇక ప్రధాన ఘట్టం శ్రీ చెన్నకేశవ స్వామి వారి గరుడ మహోత్సవం ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయ దేవేరులతో కలిసి గరుడ వాహనంపై అందంగా అలంకరింపబడ్డ శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి ఉత్సవాన్ని భక్తులు గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటి నిర్వాహకులు వల్లం అశోక్ వారి భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గరుడ ఉత్సవంలో స్థానిక వైసిపి నేత ఆనం విజయకుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే టిడిపి నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూడా పూజలు నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# సియం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన మండవ వెంకట్రావు



**కావలి రూరల్, జులై 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత ఎన్నికల్లో దివ్యాంగులకు 6 వేల రూపాయలు పెన్షన్ ఇస్తానని వాగ్దానం చేసి ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంతో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో చంద్రబాబును టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు, కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండవ వెంకట్రావు దివ్యాంగ నేతలతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నామినేటెడ్ పదవులలో మండవ వెంకట్రావుకు అవకాశం కల్పించాలని సిఫారసు చేస్తూ ఇచ్చిన లేఖను చంద్రబాబుకు మండవ అందజేశారు. ఈ సందర్భంగా మండవ వెంకట్రావు మాట్లాడారు. దివ్యాంగుల కష్టనష్టాలను తెలుసుకుని ఇచ్చిన హామీ ప్రకారం 6 వేల రూపాయలు పెన్షన్‌ను పెంచి ఇచ్చిన దివ్యాంగుల దేవుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తెలిపారు. తనకు నామినేటెడ్ పదవికి సిఫారసు చేస్తూ కావలి ఎమ్మెల్యే కావ్య ఇచ్చిన లేఖను చంద్రబాబుకు ఇవ్వడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. నామినేటెడ్ పదవులకు నన్ను సిఫారసు చేసిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. దివ్యాంగులకు ప్రతి మండలంలో 200 మందితో దివ్యాంగుల కాలనీని, ఫింగర్ ప్రింట్స్, ఐరీష్ పడని దివ్యాంగులకు ఆన్‌లైన్‌తో పనిలేకుండా నెలకు 15 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. అన్ని రకాల దివ్యాంగులకు 75 శాతంతో ఆర్టీసీలో రాయితీ పాసులు ఇవ్వాలన్నారు. వీల్‌చైర్ ఉపయోగించే దివ్యాంగులకు 10 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. దివ్యాంగుల స్థలాలు, కాలనీల ఇళ్లు సకలాంగులు ఆక్రమిస్తే వాటిని వెంటనే దివ్యాంగులకు అందజేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగ నేతలు ఉప్పటూల రవి, బట్టల శ్రీనివాసులు, మరియమ్మ, అమరావతి, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కృష్ణ, యం.వెంకటేశ్వర్లు, యోగిడి గంగయ్య, రాప్తాడు పోల్‌రెడ్డి, వంద మందిపైగా దివ్యాంగులు పాల్గొన్నారు.

## వంగవీటి రంగా విగ్రహ స్థాపనకు 2 లక్షల 50 వేలు విరాళం అందజేసిన మలిశెట్టి



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి పట్టణ ట్రంకురోడ్డులో వంగవీటి రంగా విగ్రహ స్థాపనకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎయంసి చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు 2 లక్షల 50 వేల రూపాయలు విరాళం అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. కావలి డిఎస్పీ కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డుపై రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవానికి నోచుకోవాల్సివుంది. టిడిపి కావలి సీనియర్ నేత మలిశెట్టి వెంకటేశ్వర్లు భూరి విరాళం అందజేసి కాపుల ప్రశంసలు అందుకున్నారు.

## గురుపౌర్ణమి వేడుకలలో రామదూత స్వామి ఆశీస్సులు అందుకున్న కావలి ఎమ్మెల్యే



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** మంగళగిరిలోని సికె కన్వేషన్ హాలులో జరిగిన గురుపూర్ణిమ మహోత్సవ వేడుకలలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొని రామదూత స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆదివారం జరిగిన ఈ వేడుకలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య రామదూత స్వామిని దుశ్శాలువతో సత్కరించారు. కావలి ఎమ్మెల్యే వెంట కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తటవర్తి రమేష్ కూడా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**ఉలవపాడు, జులై 21, ప్రభాతవార్త :** ఆషాఢవ్యాస పౌర్ణమి గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం ఉలవపాడు మండలంలోని భక్తులందరూ శ్రీ సద్గురు సాయినాధునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవాఉజాము నుంచే సాయిబాబాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఈ సందర్భంగా రాజుపాలెంలోని శ్రీ రత్నసాయి సురక్షిత మందిరంలో మండల కేంద్రమైన ఉలవపాడులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దత్తాత్రేయ స్వామి వారి చిత్రపటాలను ఉలవపాడులో పలు వీధుల్లో ఊరేగించారు.

## సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అక్కేశ్వరరావుని పరామర్శించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా గతంలో పనిచేసిన అక్కేశ్వరరావు శస్త్ర చికిత్స చేయించుకుని గుంటూరులోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని ఆదివారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కావలి ఎమ్మెల్యే కోరారు.

## ముగిసిన గురుపూర్ణిమ ఉత్సవాలు



**కోవూరు, జూలై 21ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో 22వ గురుపూర్ణిమ సప్తాహ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. గురుపూర్ణిమ కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అదిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జగదీష్‌స్వామి, పద్మనాభస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రామలను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు పచ్చిపాల రాధాకష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికారనరెడ్డి, ఆలయ వైస్ చైర్మన్ పచ్చిపాల విజయలక్ష్మి, భక్తులు ఉన్నారు.

## కూలిన వంతెన



**మనుబోలు, జులై 21, ప్రభాతవార్త :** మండలంలోని పిడూరు, లక్ష్మీనరసింహాపురం మధ్య వంతెన కూలింది. దీంతో రెండు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఆదివారం ఉన్నపలంగా వంతెన పగుళ్లిచ్చి సగం కూలిపోయింది. ఈ మార్గంలో వెళ్తున్న పాదచారులు, సైకిలిస్టులు, ట్రాక్టర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా రైతులు ఆందోళనలో మునిగిపోయారు. 2010లో రెండు గ్రామాల లింకు రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. 14ఏళ్లలోనే వంతెనకు కాలం చెల్లడంపైన విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాల సమయం వ్యవసాయ పనులు ప్రారంభించే టైంలో ఇక్కడ వంతెన కూలిపోవడం రెండు గ్రామాల రాకపోకలకు కొత్త బ్రిడ్జిని నిర్మించేంతవరకు ఇబ్బంది కానుంది.

## దగదర్తి శివాలయంలో వివాహ పశుపతి మహాయజ్ఞం



**దగదర్తి, జులై 21 ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలోని శివాలయంలో ఆదివారం వివాహ పశుపతి మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారికి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ఈ యజ్ఞం చేస్తే సమస్త దోషాలు, కుజదోషం, వివాహ ప్రతి బంధక దోషం, కాలసర్ప దోషం, నక్షత్ర దోషాలు, నవగ్రహ దోషాలు పోతాయని భక్తుల నమ్మకం. ఈ శివాలయంలో ప్రతి రోజు నిత్యాన్నదానం జరుగుతుందని ఆలయ బాధ్యులు తెలిపారు.

## అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**ఆత్మకూరు, జులై21, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. ఆత్మకూరు హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆత్మకూరు పట్టణంతోపాటు సమీప గ్రామాల నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బైపాస్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి సాయంత్రం 3.30గంటలకు ఈ శోభాయాత్ర ప్రారంభమైంది. పాత సినిమాహాలు మీదుగా సత్రం సెంటర్, చావిడి, ఎరుకల సానినగర్, సోమశిల సెంటర్ నుంచి ఆర్టీసి డిపో వరకు తిరిగి మున్సిపల్ బస్టాండ్ మీదుగా అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద ఈ శోభాయాత్ర ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన భక్తిగీతాలు, డిజె, మంగళవాయిద్యాలు, కోలాటాలు, డ్రమ్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో పార్టీలతో సంబంధం లేకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు , మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తమ మోటర్‌బైక్‌ల్లో ముందువరుసలో యాత్ర కొనసాగించడం పలువురు అభినందిస్తున్నారు.

## జవహర్‌నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**మర్రిపాడు, జులై21, ప్రభాతవార్త :** జిల్లాలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ ఎస్.గౌసియాబేగం తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయంలో జిల్లాలో నివసిస్తున్న అభ్యర్థులు మాత్రమే పరిక్షలు వ్రాసేందుకు అర్హులన్నారు. 1-5-2013కు ముందుకానీ 31-7-2015 తర్వాత కాని పుట్టిన వారు అర్హులు కాదన్నారు. 3,4 తరగతుల్లో ఉత్తీర్ణత పొంది 2024-25 సంవత్సర ంలో 5వ తరగతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డ్‌తోపాటు విద్యార్థి రెసిడెన్సి సర్టిఫికేటు దరఖాస్తుకు జతచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో అభ్యర్థులకు 75శాతం సీట్లు , పట్టణప్రాంత అభ్యర్థులకు 25శాతం సీట్లు కేటాయించారన్నారు. మొత్తం సీట్లలో 33శాతం బాలికలకు కేటాయించబడ్డాయని ఆమె తెలిపారు. వెనుకబడిన కులాలు, ఒబిసి, ఎస్సీ, ఎస్టీ , వికలాంగులకు భారత ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. దరఖాస్తు చేసేందుకు 16-9-2024వ కు గడువు ఉందన్నారు. ప్రవేశపరిక్ష 2025జనవరి 18న జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి విద్యార్థులకు సమాచారం కావాలంటే కృష్ణాపురంలోని జవహర్ నవోదయవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నందు సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ ఫోన్ నెంబర్ 8106898817, 9493514644 , 8985007588నెంబర్లను సంప్రదించాలని గౌసియాబేగం కోరారు.

## గురు పౌర్ణమి సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక పూజలు



**ఉదయగిరి, జులై 21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరి లోని బీసీ కాలనీ వద్ద ఉన్న శ్రీ సాయినాథ మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా భక్తితో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన మహిళలు శ్రీ సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశ్శ్సులు పొందారు. కోలాటం నిర్వహించిన భక్తులు సాయినాధుని సన్నిధిలో భక్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ సాయినాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఉత్సవం నిర్వహజంచారు. సాయి నాధుని సన్నిధిలో భక్తితో పూజలు నిర్వహజంచి వారికి ఆయన ఆశ్శ్సులు ఎప్పుడు ఉంటాయని పూజారులు తెలిపారు. ఈ కార్యక్రమంఆద్యాంతం భారీగా తరలివచ్చిన భక్త జన సందోహం మధ్య భజనలు కీర్తనలు నిర్వహిస్తూ సాయి నాధుని సుత్తించి ఆనయ ఆశీస్సులు పొందారు.

## ఇన్వెస్టర్స్ గ్లోబల్ సమ్మిట్ లో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్...



**ఉదయగిరి, జులై 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరం లో ఏర్పాటు చేసిన ఇన్వెస్టర్స్ గ్లోబల్ సమ్మిట్ 2024లో ఉదయగిరి శాసన సభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు పాల్గొన్నారు. ఈ సభను ఉద్దేశించి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గము చాలా వెనుకబడిన ప్రాంతమని, ఆ ప్రాంతం లో సాగునీరు, త్రాగునీరు కొరత ఉన్నదని, భూగోళిక విస్తీర్ణంలో పెద్ద నియోజకవర్గమని, నైపుణ్యంతో కూడిని 50 వేల మంది నిరుద్యోగ యువత వున్నారని, పరిశ్రమలు స్థాపించుటకు అనువైన ప్రాంతమని, ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని, వెనుకబడిన ప్రాంతములో పెట్టుబడులు పెట్టే పారిశ్రామిక వేత్తలకు తెలుగుదేశం పార్టీ కూడా అండగా ఉంటుందని, ఉదయగిరి నియోజకవర్గమును సందిర్శంచి ఆ ప్రాంత అభివృద్ధి కొరకు తోడ్పాటును అందించాలని పారిశ్రామికవేత్తలను కోరడం జరిగినది.

## ఆధ్యాత్మికవేత్త చలమలా యల్లారెడ్డికి కన్నీటి వీడ్కోలు



**కలువాయి జులై 21 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన కలువాయిలో వెలసియున్న శ్రీషిర్డిసాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు చలమల యల్లారెడ్డి (73) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. ఈ ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి మాదాసు గంగాధరంతో పాటు గ్రామంలోపెద్దలు పలువురు ఆయన అంతిమ సంస్కార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో లక్షల రూపాయాలతో తన సొంత నిధులు వెచ్చించి సాయిబాబా మందిరాన్ని ఏర్పాటు చేసి గ్రామానికి అంకితం చేసిన ఆద్యాత్మి వేత్త యల్లారెడ్డికి గ్రామస్తులు కన్నీటితో వీడ్కోలు పలికారు. చివరిచూపు చేసేందుకు గ్రామం నుండి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

## కుల్లూరులో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**కలువాయి జులై 21 ప్రభాతవార్త :** మండలంలోని కుల్లూరు గ్రామంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలోవేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయకర్తలు అయిన మాజీ ఎంఎల్‌సి మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు ఇంటి వద్ద నుండి స్వామి వారికి వస్త్ర పూజా సామాగ్రిని సాంప్రదాయ బద్దంగా మేళతాళ్ళలతో ఆలయం వద్దకు తీసుకొని వచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం సాయినామస్మరణతో దేవస్థానం ప్రాంగణంలో పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించగా గ్రామంలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పల్లకీమోసి తరించారు. మద్యహ్నాం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామశక్తి పోలేరమ్మ తల్లి, అర్చకస్వామి దేవస్థానం నందు మాదాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పీటీపీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సవరం శ్రీనివాసులు, గంజి శ్రీనివాసులు ఎన్నిక



**ఉలవపాడు, జులై 21, ప్రభాతవార్త :** కరేడు ర్యాంపు వద్ద హోటల్‌లో పీటీపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయు) జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చిమట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సమావేశానికి సీఐటీయు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ పాల్గొని మాట్లాడారు. గత పది ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని తీవ్రంగా అణిచివేసేందుకు ప్రయత్నం చేసిందని, కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గ హక్కులను హరించిందన్నారు. నిరంకుశంగా వ్యవహారించిందన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలను పెంచి పోషించిందన్నారు. అందుకనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు, సీట్లు తగ్గాయన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ ప్రభుత్వం కనీస వేతనం, కరువు భత్యం అసంఘటితంగా కార్మికుల సంక్షేమం గురించి సక్రమంగా పట్టించుకోలేదని, కార్మిక ఉద్యమాల పట్ల అహంకారపూరితంగా వ్యవహారించిందన్నారు. ఫలితంగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. మేము అధికారంలోకి వస్తే అసంఘటితంగా అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమం, భద్రత కల్పిస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తాము, ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తాము, కార్మిక ఉద్యమాల పట్ల ప్రజాస్వామ్య పద్దతిలో వ్యవహారిస్తామని చెప్పారు. అలా కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు పెద్దపీట వేసి ప్రేవేటీకరణ విధానాలను అమలు చేస్తే ఉద్యమాలు తప్పవని జీవీబీ కుమార్ అన్నారు. ఆగష్టు 16,17,18వ తేదీల్లో నెల్లూరులో సీఐటీయు రాష్ట్ర కౌన్సిల్ మీటింగ్ జరుగుతుందని, 16వ తేదీన నర్తకి సెంటర్‌లో జరిగే బహిరంగ సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం పీటీపీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సవరం శ్రీనివాసులు, కార్యదర్శిగా గంజి శ్రీనివాసులు, కోశాధికారిగా చిలకా శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మస్తాన్‌బి, ఉపాధ్యక్షులుగా ఆర్.సుబ్బరామయ్య, సహాయ కార్యదర్శులుగా యు.వెంకట సుబ్బయ్య, కే.మహేశ్వరరావులు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కండ్లగుంట వెంకటరావు, మద్దసాని రాజ్యంతో పాటు మరో ఐదు మందిని ఎన్నుకున్నారు. ఫ్యాక్టరీలో ఆదివారం డ్యూటీ చేయాలనే యాజమాన్య నిబంధనను వ్యతిరేకించారు. ఈ సమావేశంలో సీఐటీయు ఉలవపాడు మండల నాయకులు చిమటా శ్రీనివాసులు, మాజీ ఆఫీస్ బేరర్ సీహెచ్ కోటేశ్వరరావుతో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేలాదిమంది భక్తులతో పోటెత్తిన సాయిబాబా మందిరం

## ఘనంగా ముగిసిన గురుపౌర్ణమి మహోత్సవం



**కందుకూరు జూలై 21, ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్డునందలి శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. దేవస్ధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 21 వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగ ణాన్ని విద్యుద్దీపాలతో శోబాయిమానంగా తీర్చిదిద్దారు. 11 రోజులుపాటు సాయిబాబాగారికి బిక్షాటన, సచ్చిరిత్ర సామూహికపారాయణము, సాయిసత్యవ్రతం, సాయి బాబా నగరోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం తదితర ప్రత్యేక పూజాకార్యక్రమాలు, హోమ ములును నిర్దేశిత తేదీలలో నిర్వహిం చారు. ఉత్సవాల ముగింపుసందర్భంగా ఆదివారం ఆలయప్రాంగణము భక్తులతో పోటెత్తింది. పట్టణంతోపాటు పరిసరగ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వ హకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని భక్తి శ్రద్దలతో పూజించారు. ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటుచేశారు .సర్వదర్శనంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తజనంతో కోవూరు రోడ్‌లోని ఆలయప్రాంతం ట్రాపిక్‌తో రద్దీ ఏర్పడింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమై రాకపోకలను క్రమబద్ధకరించారు. వేలాదిమందికి ఉచిత అన్నదానం ఆలయంలో దేవస్ధానం ట్రస్ట్ ఆధ్వర యంలో వేలాదిమందికి ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. మహిళలకు పురుషులకు వేరువేరుగా అన్నప్రసాదాలు అందించారు. భక్తుల రద్దీదృష్ట్యా బఫే సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. మద్యాహ్నం 11గం॥నుంచి సాయంకాలం 3గ॥లకు వేలమందిఈ అన్న ప్రసాదాలు స్వీకరించారు. దేవాదాయశాఖలో విలీనం చేయాలి దాతల సహకారంతో....నిర్వహకులుశ్రీ షిరిడి సాయిబాబా దేవస్ధానాన్ని సుమారు 20ఏళ్లుగా భక్తులు, దాతల సహాయసహకారంతో నిర్వహిస్తున్నట్లు ట్రస్టీలు తెలిపారు. విధుల్లో ఉన్న ట్రస్టీలు పువ్వాడి నరసింహారావుతోపాటు పలువురుని ప్రభాతవార్త ఆదివారం ఆలయప్రాంగణంలో పలకరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది గురుపూర్ణమి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా, ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న దాతలకు భక్తులకు కృతజ్ఞతలన్నారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వంలో విలీనం చేయాలి:కందుకూరు పట్టణం కోవూరు రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్ధాన అభివృద్ధిపై దృష్టిసారించాల్సిందిగా పలువురుభక్తులు నిర్వహకులకు సూచిస్తున్నారు. అవసరమైతే దేవాదాయశాఖలో విలీనానికి తగుచర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు. పట్టణంలో ఈ ఆలయంకు అత్యంత ప్రాధాన్యత ఉంది. అత్యదికమంది ప్రజలు సాయిబాబాపై భక్తిపారవశ్యంతో పునీతులవుతారు. ఈ నేపద్యంలో ఆలయ అభివృద్ధి ఎంతో అవసరం. ప్రస్తుతం ఆశించిన రీతిలో వసతులు, వనరులు కల్పించాల్సి ఉంది. ఇందుకు అవసరమైన సహాకారాన్ని భక్తుల నుంచే కాక ప్రభుత్వం నుంచి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వంలో విలీనం చేయాల్సిన ఆవశ్యకతను సైతం గుర్తించాల్సిందిగా పలువురు భక్తులు నిర్వహకులుకు సూచిస్తున్నారు.



## అవినీతిని ప్రశ్నిస్తే మా పై అసత్య ఆరోపణలా

## మైనార్టీ నాయకులు షఫీ ఉల్లా



**ముత్తుకూరు, జులై 21, ప్రభాతవార్త :** ముత్తుకూరు పంచాయితీలో భారీగా అవినీతి జరిగిందని వాటిపై విచారణకు రాకుండా కాకుటూరు లక్ష్మణ్ రెడ్డి మా పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని టిడిపి మైనారిటీ నాయకులు షఫీ ఉల్లా, పంచాయితీ సర్పంచ్ బూదూరు లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రైవేట్ రెసిడెన్సిలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షఫీ ఉల్లా మాట్లాడుతూ కాకుటూరు లక్ష్మణ్ రెడ్డి, పంచాయితీలో కోట్ల రూపాయిలు విలువచేసే రెవెన్యూ స్థలాన్ని ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించుకుని స్నేహితులకు ఆస్తిపత్రాలు చూపించి అదే ఆస్తిని డబుల్, త్రిబుల్ రిజిస్ట్రేషన్లు చేసి స్నేహితులను బీసీ, ఎస్సీ వర్గాలకు మోసం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మార్కెట్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి బ్రాందీ షాపులను ఏర్పాటు చేశారని అన్నారు. బ్యాంకులో లోను కూడా తీసుకొని లోను కట్టకుండా తిరుగుతున్న ఘనుడు ఆయన అన్నారు. ఆయన సతీమణి ఉప సర్పంచ్ కాకుటూరు అనిత రెడ్డి గ్రామ పంచాయితీలలో మాంసం దుకాణాలు, చిల్లర దుకాణాలు వద్ద రోజువారి మామూళ్ల వసూలు చేయడం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. మేము భూస్వామి కుటుంబాలంటూ ప్రగల్భాలు పలికే వారు దళితులపై దాడి చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. పంచాయితీ స్థలాన్ని కూడా ఆక్రమించారని దానికి తగ్గ ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌ను పంపిణీ చేసిందని దాన్ని ఆసరాగా తీసుకొని కాకుటూరు లక్ష్మణ్ రెడ్డి ఒక్కొక్కరు దగ్గర 500 నుండి 2000 వరకు వసూలు చేశారని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ పథకం నిధులు, అలాగే జిపి నిధులు 15,16 నిధులు నుంచి దొంంగ బిల్లు పెట్టి కోట్ల రూపాయిలు అవినీతి చేశారని అన్నారు. దళితుల చులకన భావంతో పాత హరిజనవాడలోని దళితుల ఇల్లు జెసిపితో పెట్టి కూల్చి ఇంటి మోటర్ ధ్వంసం చేసి లక్ష్మణ్ రెడ్డి పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది నిజము కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పంచాయితీలో జరిగిన అవినీతిని విచారణకు సిద్ధం కావాలని ఈ ఐదు సంవత్సరాల్లో వైసిపి నాయకులు కోట్ల రూపాయిలు అక్రమంగా సంపాదించుకున్నారని వాటిని కూడా త్వరలో ఆధారాలతో బయట పెడుతామని తెలిపారు. చక్రవం వెంకటేశ్వర్లు నా దగ్గర 3 లక్షల పైగా నగదును అప్పు తీసుకున్నారని అప్పులో భాగంగా నా ఫోన్ పేకి కొంత అమౌంట్ జమ చేశారని అది నిజమే అన్నారు. అలాగే వ్యక్తిగత దూషనలు మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ దృష్టికి అలాగే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో ముత్తుకూరు పంచాయితీలో జరిగిన అవినీతి ఆధారాలతో అందజేస్తామని అన్నారు. అనంతరం సర్పంచ్ లక్ష్మీ మాట్లాడుతూ ఎస్టీ మహిళలను అప్పటి పంచాయితీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు పంచాయితీలో దొంగ బిల్లులను పెట్టి నా అకౌంట్ ద్వారా డబ్బులు డ్రా చేసుకుని ఇష్టానుసారంగా ఖర్చు పెట్టుకునే వారని అన్నారు. నగదులు ఎందుకు డ్రా చేయాలి అని అడిగితే నీకు చెప్పాల్సిన అవసరం మాకు లేదంటూ బెదిరించారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామని ముత్తుకూరు పంచాయితీ అవినీతిపై కూడా సిబిఐ ఎంక్వైరీ చేయాలని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నెల్లూరు శేషమ్మ, మాభాష, మనీ, శ్రీహరి, అల్లరి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పండుగకు ఆహ్వానించిన ఉత్సవ కమిటీ



**నెల్లూరు, జులై 21, ప్రభాతవార్త – వైద్యం :** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం నగరంలోని హరనాథపురంలో ఉన్న అజీజ్ నివాసంలో ఆయనని బారాషాహిద్ దర్గా ఉత్సవ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి ఆదివారం సాయంత్రం జరిగే రొట్టెల పండుగ ముగింపు సభకు రావాలని సభ్యులు ఆహ్వానించారు.

## బోగోలులో ఘనంగా గురుపౌర్ణమి ఉత్సవాలు



**బిట్రగుంట, జులై 21 ప్రభాతవార్త :** బోగోలు మండలంలో ఆదివారం గురు పౌర్ణమి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయిబాబా మందిరాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్య క్రమాలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. బోగోలు రాజ వీధిలోని స్వర్గీయ అమర బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చైర్మన్ బచ్చు కృష్ణకుమార్ దంపతులు సాయి బాబాకు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. విశ్వనాథరావుపేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం, గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పాతబిట్రగుంటలోని శ్రీ షిర్డీ శేషసాయి మందిరంలో గురుపౌర్ణమి, మందిర 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బ్రహ్మానందం ఆధ్వర్యంలో జరిగాయి.

## గ్రంధాలయంలో చదవటం మాకిష్టం



**ఉలవపాడు, జులై 21, ప్రభాతవార్త :** ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఉదయం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భాస్కర, వేమన శతకాలు, నీతి కథలు చదివిం చారు. అనంతరం గ్రంధాల యాధికారి దాసరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే శతకాలలో పాటు వాటి వాటి భావాలను కూడా నేర్చుకోవాలని సూచించారు. అదే విధంగా ఉలవపాడు శాఖ గ్రంధాల యానికి అనుబంధంగా ఉన్న చాకిచర్ల గ్రంథాలయంలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

## ఆకట్టుకున్న కోలాటం



**కోవూరు, జూలై 21 ప్రభాతవార్త :** కోవూరులోని షిరిడీ సాయి మందిరంలో 22వ గురుపూర్ణిమ సప్తాహ మహోతవాలు అంగరంగ వైభవంగా ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహిళల కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా సాయి నామస్మరణతో చేపట్టిన ఈ కోలాట కార్యక్రమం ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ పూర్తిస్థాయిలో కట్టిపడేసింది. అనంతరం కోలాటం వేసి మహిళలను ఆలయ ధర్మకర్తలు ప్రత్యేకంగా అభినందించారు. – ఘనంగా సన్మానం షిరిడీ సాయి మందిర అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తున్న మన్నెమాల రవిచంద్రారెడ్డి , జ్యోతి దంపతులకు ఆలయ వ్యవస్థాపక ట్రస్టీలు పచ్చిపాల గోపాల్‌రెడ్డి, పచ్చిపాల సుజాతల ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. అదేవిధంగా నెల్లూరు కూరగాయల మార్కెట్ చైర్మన్ కె. తాతిరెడ్డిని కూడా ఆలయ మర్యాదలతో సత్కరించి సన్మానం చేశారు.

## శాఖంబరీ అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి



**పొదలకూరు, జులై 21, ప్రభాతవార్త :** పొదలకూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం శాఖంబరి అలంకారంతో వాసవి అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారిని వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షం స్వీకరించారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



**అనంతసాగరం, జులై21, ప్రభాతవార్త :** మండలంలోని రేవూరు ఉన్నతపాఠశాల పూర్వవిద్యార్థి, నెల్లూరులోని ప్రముఖ వైద్యశాల ఎనెల్ సూపర్ స్పెషాల్టీ హాస్పెటల్ అధినేత , కార్డియాలజిస్ట్ కె.నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈశిబిరంలో న్యూరాలజిస్ట్ కుంకాల లావణ్య, జనరల్ మెడిసన్ డాక్టర్ దావూద్‌లు రోగులకు పరిక్షలు నిర్వహించారు. వేలాదిరూపాయలు ఖర్చు అయ్యే ఇసిజి, ఎకో పరిక్షలు ఉచితంగా నిర్వహించారు. 1000మంది రోగులకు వైద్యపరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లంపాటి వెంకటేశ్వర్‌రెడ్డి పూర్వ విద్యార్థి నాగేంద్రప్రసాద్‌ను ఘనంగా అభినందించారు. ఈకార్యక్రమంలో మద్దలూరు రాజేంద్రప్రసాద్, వంటేరు మల్లిఖార్జున, సుసర్ల ప్రకాష్, కొక్కంటి నరేష్, సయ్యద్ మస్తాన్ షరీఫ్, మద్దులూరు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**వింజమూరు, జులై21, ప్రభాతవార్త :** వింజమూరు పట్టణంలోని పలు సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపూర్ణిమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాయిదివ్యనామాన్ని జపించారు. ముందుగా గణేష్ పూజ నిర్వహించి భక్తుల ఇష్టదైవానికి పూజలతోపాటు బాబాను చందనంతో అలంకరించి సుగంధ పుష్పాలతో స్వామివారి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ముదుపు లు కట్టారు. స్వామివారికి ఇష్టమైన పులగాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

## "గడ్డం" ధాతృత్వం



**వింజమూరు, జులై21, ప్రభాతవార్త :** వింజమూరు సుజాతనగర్ కాలనీకి చెందిన సయ్యద ఇలియాస్ జీవనాధారంకోసం అద్దాలు దింప పనికి వెళ్ళిదింపుతున్న అద్దం గొంతులో దిగబడి ప్రమాదానికి గురికావడంతో చెన్నైలో ప్రవేటు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలుసుకున్న కలిగిరికి చెందిన విలేఖరి గడ్డం పకీరయ్య తన మిత్ర బృందంతో కలసి ఇలియాస్‌కు 15వేల రూపాయలు ఆర్థికసాయమందజేశారు. పకీరయ్య పేదవారు ఆపదలో ఉంటే తనవంతు ఆర్థికసాయం చేసి తోటి మిత్రులకు తెలియజేసి వారిలో కూడా సేవాదృక్పదం ఏర్పరచి సేవా కార్యక్రమంలో తన మిత్రులను సైతం భాగస్వాములను చేసి సమాజంలోని పేదవారికి ఎంతో కొంత మేలు చేయాలనే ఆశయం ఉన్న వ్యక్తి అని మీడియా మిత్రులు అభినందించారు. ఇలియాస్‌కు మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న పత్రి శిరీష వారి స్నేహితులు 5వేల రూపాయలను విరాళంగా ఇలియాస్‌కు అందజేశారు. మోటార్ షాపు యజమాని భాస్కర్‌రెడ్డి ఇలియాస్‌కు 10వేల రూపాయలను అందజేశారు. ఇలియాస్ ఆరోగ్యం కొరకు వారి కుటుంబ సభ్యులతోపాటు పలువురు స్వచ్ఛందంగా పట్టణంలో విరాళాలు సేకరించారు.

## కావలి శివాలయంలో రాజదుర్గాదేవికి శాఖాంబరి అలంకారం



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి పట్టణ శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (కావలి శివాలయం) ఆలయ ప్రాంగణంలో వేంచేసి వున్న శ్రీ రాజదుర్గాదేవి అమ్మవారికి ఆదివారం ఆలయ అనువంశిక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్ శాఖాంబరి అలంకారం చేశారు. మహిళలు అమ్మవారికి కూరగాయలతో మాలలు తయారుచేశారు. అమ్మవారి ఆలయం ముందు ఉత్సవ విగ్రహానికి కూడా శాఖాంబరి అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## భక్తి శ్రద్దలతో అంకమ్మ తల్లి పొంగళ్ళు



**చేజర్ల జులై 21 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని కొట్టాలు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత అంకమ్మ తల్లికి భక్తి శ్రద్దలతో మహిళలు పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాదిలాగే ఆనవాయితి ప్రకారం గ్రామస్తులందరు అంకమ్మతల్లికి పొంగళ్ళు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. గ్రామంలో పాడిపంటలు బాగా పండి గ్రామం అభివృద్ధి వృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు. మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**అనంతసాగరం, జులై21, ప్రభాతవార్త :** మండలంలోని అనంతసాగరం, సోమశిల, రేవూరు గ్రామాల్లో ఆదివారం గురుపూర్ణిమ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన అనంతసాగరంలోని సాయిబాబా మందిరంలో మందిరం చైర్మెన్ బట్రెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేవూరులో శ్రీసాయి తేజ ట్రస్ట్ చైర్మెన్ బోయిళ్ళ జనార్ధన్‌రెడ్డి ఆధ వ్యర్యంలో షిరిడీ సాయిబాబా కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఉదయగిరి డిపో ఆర్టీసీ కండక్టర్




**ఉదయగిరి, జులై 21, ప్రభాతవార్త:** ఉదయగిరి డిపోకి చెందిన కె.శ్రీనివాసులు.ఎంప్లాయ్ నెంబర్ 510964 కండక్టర్ తేదీ 17/07/2024 తన బస్సులో దొరికిన 1700/- రూపాయలు డబ్బులు మరియు ఎటిఎం కార్డులు, ఆర్సి కార్డులు, లైసెన్స్ కార్డు, కలిగియున్న పర్సుని డిపో మేనేజర్ గారికి అందజేసినారు. డిపో మేనేజర్ గారు కార్డులో ఉన్న అడ్రస్ ను బట్టి వారికీ ఫోన్ ద్వారా సమాచారం అందించినారు మరియు పర్సు పోగొట్టుకున్న సయ్యద్ మున్వర్ భాషా కు డిపో మేనేజర్ గారు తమ సమక్షంలో కండక్టర్ కె.శ్రీనివాసులు చేత పర్సును అందించడం జరిగింది. కండక్టర్ గారి నిజాయితీకి డిపో మేనేజర్ గారు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేసినారు.

## పెద్దఎత్తున అన్నదానం




**కోవూరు, జూలై 21ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్తలు, దాతలు మన్నెమాల రవిచంద్రారెడ్డి, జ్యోతి దంపతుల సహకారంతో భారీ స్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్నప్రసాదాన్ని దగ్గరుండి అందజేసేలా ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్టీ పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు పచ్చిపాల రాధాకష్ణారెడ్డి, పచ్చిపాల మల్లికారనరెడ్డి, ఆలయ వైస్ చైర్మన్ పచ్చిపాల విజయలక్ష్మి, భక్తులు ఉన్నారు

## అపరిశుభ్రతలో ఏకలవ్యనగర్

## పట్టించుకోని మునిసిపల్ అధికారులు





**కందుకూరు జూలై 21, ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్ ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ఈ కాలనీలో దాదాపు అంతా కూలీనాలీ చేసుకునే జీవించే పేదలే. అయితే ఇక్కడ ఎమ్మెల్యే పోతుల రామారావు హయాంలో చక్కని సీసీ రోడ్లు నిర్మించారు. ప్రజలు రాకపోకలకు చాలా సౌకర్యంగా ఉంది. అయితే సీసీరోడ్లువెంట గల సైదు డ్రెయిన్స్‌లో మురుగునీటి ప్రవాహం నిలిచిపోయింది. మున్సిపల్ సిబ్బంది వీటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలో మురుగుకాలువలను తరచూ శుభ్రపరుస్తారని ఇక్కడ మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తద్వారా ఈ కాలువులు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దుర్వాసన వెదజల్లడం, పగలు రాత్రులు అనే తేడా లేకుండా ఎల్లపుడూ రకరకాల దోమలు, ఈగలు నిత్యం జనం చుట్టూతిరుగుతుంటాయని కొండమ్మ తెలిపారు. రెండురోజులుకొకసారి మంచినీటి విడుదల చేస్తారని తద్వారా తాగునీటికి సైతం ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందుతున్నారు. రాత్రిళ్లు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ కాలనీలో చాలామంది ఎస్సీ, ఎస్టీలకు పక్కా ఇళ్లులేక ఇబ ందిపడుతున్నారు. గుడారాల్లో నివాసాలు ఉంటున్నారు. కాలనీ ఇళ్ల నిర్మించి ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. ఇటీవల కొత్త ఎమ్మెల్యే గారికి తమ సమస్యలు వివరించామని ఇళ్ల మంజూరుచేయిస్తానని తెలిపినట్లు చల్లమ్మ ఆమె భర్త జగన్నాదం తెలిపారు.

## ఉదయగిరిని జిల్లా చేయండి

## ముఖ్యమంత్రి కి విన్నవించిన ఉద్యమ నేతలు



**ఉదయగిరి, జులై 21, ప్రభాతవార్త:** అభివృద్ధికి నోచక, వనరుల లేమితో కొట్టుమిట్టాడుతూ జనావాస లేమి ప్రాంతముగా మారుతున్న ఉదయగిరిని, పరిసర నియోజకవర్గాలను కలిపి ప్రత్యేక జిల్లాగా చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని ఉదయగిరి జిల్లా నేతలు కలిసి ఆవశ్యకతను రిప్రజెంటేషన్ చేశారు. గత ప్రభుత్వపు జిల్లాల విభజనలో మా ప్రాంతానికి అన్యాయం జరిగిందని, మాడిమాండ్‌ను పరిగణ లోకి తీసుకొన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయగిరి, ఆత్మకూరు ,కనిగిరి, బద్వేలు, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలోని 21 మెట్ట మండలాలు అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నాయని ముఖ్యమంత్రి గారికి విన్నవించారు. మూడు జిల్లాల వాసులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా రవాణా, మౌళిక వసతుల కల్పన, విద్య, వైద్య రంగాలు, వ్యవసాయ రంగాలు మెరుగు పడతాయని ఆశ్యాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జిల్లా ఉద్యమ నాయకులు డా. కె వేణుగోపాల్, షేక్ దస్తగిరి అహమ్మద్, గాజులపల్లి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయి సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు



**బుచ్చి జులై 21 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌లోని సాయిబాబా సన్నిధిలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడాహారతి, స్వామి వారికి క్షీర పంచామృతాభిషేకం, నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సామూహిక సత్యవ్రతాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా మణిమాల మధుసూదన్‌రెడ్డి ,రమాదేవి కుమార్తె సాయిలక్ష్మి వ్యవహారించారు. మద్యహ్నం హారతి అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుపౌర్ణమి శాశ్వత అన్న ప్రసాద విరాళ దాతలుగా బుచ్చిరెడ్డిపాళెం ట్యాక్సీ స్టాండ్ అసోసియేషన్ ( తెలుగువారు), కీర్తిశేషులు పెళ్లకూరు బాలక్రిష్ణారెడ్డి, జ్ఞాపకార్ధం కోటా రాజగోపాల్‌రెడ్డి, సునీతమ్మ, కుమారుడు కోటా జయవర్ధన్‌రెడ్డి వ్యవహారించారు. అలాగే కీర్తిశేషులు అచ్యుత సుబ్బారావు, లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్ధం కుమారులు సుబ్రమణ్యం, అచ్యుత్ శివప్రసాద్ వ్యవహారించారు. సాయింత్రం సంధ్యహారతి, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమీటి వారు పర్యవేక్షించారు.

## కోటి తీర్థంలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**చేజర్ల జులై 21 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని కోటి తీర్ధం గ్రామంలో శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా చేజర్ల మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివా సులునాయుడు వారి బందువులు హాజరైయ్యారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిం చారు. అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తగా గురిజాల శ్రీనివాస చౌదరి, శ్రావ్యా వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరం



**బిట్రగుంట, జులై 21 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని రామస్వామిపాళెంలో ఆదివారం శ్రీ విఘ్నేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆలిండియా హ్యూమన్ రైట్స్, జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యంలో బిందుమీనన్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ బిందుమీనన్‌చే ఉచిత న్యూరాలజీ వైద్యశిబిరం నిర్వహించారు. పక్షవాతం రాకముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పక్షవాతం వచ్చే సంకేతాలను ఏ విధంగా గుర్తించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. పలువురు రోగులను పరీక్షించి సలహాలు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరు మంజుల, అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, ఆలిండియా హ్యూమన్ రైట్స్ జిల్లా చీఫ్ దాసరి సునీల్, సెక్రటరీ ఎస్.కె.నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కొండబిట్రగుంటలో వైభవంగా ఆషాడ పౌర్ణమి గరుడ సేవ



**బిట్రగుంట, జులై 21 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాడ మాస పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. గోవిందనామ స్మరణతో గరుడ వాహనంపై శ్రీవారు ఊరేగుతున్నప్పుడు బిలకూట క్షేత్రం మారుమోగింది. ప్రతి మాసంలో పౌర్ణమి రోజున టిటిడి తరహాలో గరుడ సేవ ఉత్సవాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తుండటం తెలిసిందే. గరుడ సేవ ఉత్సవానికి ఉభయకర్తలుగా దగదర్తి గ్రామానికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు వ్యవహారించారు. ఉత్సవ నిర్వహణ కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ పర్యవేక్షణలో జరిగింది.

## ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది



**కావలి రూరల్, జులై 21 ప్రభాతవార్త :** ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. కావలి పట్టణంలోని మన్నెం గోపాలకృష్ణారెడ్డి కళ్యాణమండపం నందు ఆదివారం యుటిఎఫ్ జిల్లా మద్యంతర సమావేశం జిల్లా అధ్యక్షుడు వి.వి.శేషులు అధ్యతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ 50 సంవత్సరాలలో ఉపాధ్యాయ ఉద్యమంలో ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ వికాసంతో ప్రారంభించిన యుటిఎఫ్ ఎంతవరకు సాధించింది, భవిష్యత్‌లో ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఏమి ప్రయత్నం చేయాలనే దానిని ప్రధానంగా చర్చించబోతున్నామన్నారు. గత ప్రభుత్వం 117 జీవో తీసుకురావడం, ఇంగ్లీషు మీడియాన్ని ప్రవేశపెట్టడం, పాఠశాలల విలీనం పేరుతో పాఠశాలలో ఈ సంవత్సరం అకాడమిక్ ఇయర్ ప్రారంభం అయిన తర్వాత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేరకుండా సుమారు 4 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చేరుతున్న పరిస్థితి వుందని తెలిపారు. అధికారంలోకి రాకముందు మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో చెప్పిన విధంగా జీవో 117ను తక్షణం రద్దు చేయాలని, 1 నుండి 5 వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జీవో నెం.117ను రద్దు చేయాలని, విలీనం చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించాలని, ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే వుండాలని, 12వ పిఆర్సీని తక్షణం అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్, ప్రమోషన్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఉపాధ్యాయ నియామకాలలో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలి, రాష్ట్ర విద్యావ్యవస్థలో ఒకే సిలబస్ చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులు బి.శ్రీదేవి, జిల్లా అధ్యక్షులు వి.వి.శేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు, జిల్లా సహ అధ్యక్షులు యం.సి.అబ్బయ్య, జిల్లా కోశాధికారి ఎ.మురళీధర్‌రావు, జిల్లా కార్యదర్శి బి.మాధవరావు, పూర్వపు జిల్లా కార్యదర్శి పి.మాధవ, కావలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె.ముజీబ్ అహ్మద్, జి.వేణుగోపాల్, జెవివి నేతలు కృష్ణారెడ్డి, తోట వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







## కావలి ఎమ్మెల్యే కావ్యను కలిసిన జనసేన నేత అళహరి



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పార్టీ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిశారు. కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న పనులను ఆయన అభినందించారు. నెల రోజుల్లోనే స్పష్టమైన అభివృద్ధి కనపడటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## పండుగకు ఆహ్వానించిన ఉత్సవ కమిటీ



**నెల్లూరు, జులై 21, ప్రభాతవార్త – వైద్యం :** తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం నగరంలోని హరనాథపురంలో ఉన్న అజీజ్ నివాసంలో ఆయనని బారాషాహిద్ దర్గా ఉత్సవ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి ఆదివారం సాయంత్రం జరిగే రొట్టెల పండుగ ముగింపు సభకు రావాలని సభ్యులు ఆహ్వానించారు.

## అనితను కలిసిన పనబాక దంపతులు



**నెల్లూరు, జులై 21, ప్రభాతవార్త – వైద్యం :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితని మర్యాదపూర్వకంగా నెల్లూరు పార్లమెంటు టిడిపి మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి దంపతులు ఆదివారం విజయవాడ ఉండవల్లిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వంగలపూడి అనితకి శాలువా కప్పి పుష్పగుచ్చాన్ని అందజేసి సన్మానిం చారు. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మితో పాటు టిడిపి లీగల్ సెల్ న్యాయవాది పనబాక గంగరాజు, పనబాక గంగబాబు, రాయాపు హరి, రవి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థి చొరవ



**కోవూరు జులై 21 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరులోని సంక్షేమ వసతి గృహంలో 2004–5 సంవత్సరంలో చదివిన మునునూరు వెంకటరమణయ్య అనే విద్యార్థి ఇటీవల మృతిచెందాడు. ఈ మేరకు తన సోదరుడి జ్ఞాపకార్థం తమ్ముడు శ్రీనివాసులు రూ.5 వేలకు పైగా వ్యయం చేసి ఈ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులందరికీ పెద్ద ఎత్తున సోప్ కిట్ బ్యాక్సులను పంపిణీ చేసి తన సోదరుని రుణం తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జుల్ఫికర్ ఆలీ, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూ పరబ్రహ్మం, సంక్షేమాధికారి నాగరాజు, , రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు పావురాల వేణు, తదితరులు ఉన్నారు.
– సంక్షేమ వసతి గృహానికి రూ. 15 వేలు విలువ చేసే టీవీ అందిస్తాం కోవూరు మండలం పాటూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహానికి 2004–5 సంవత్సరంలో చదివిన విద్యార్థులు తమ గుర్తుగా రూ. 15 వేలు విలువ చేసే టీవీని అందజేస్తామని పూర్వ విద్యార్థులు సురేష్, వెంకయ్య, అరుణ, సురేంద్రలు ఈ సందర్భంగా విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

## ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణం



**కోవూరు జులై 21 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ఆదివారం గురుపూర్ణిమ మహోత్సవాన్ని పురస్కరించుకుని విష్ణుసహస్ర నామ పారాయణాన్ని భక్తమండలి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన షిర్డీ సాయిబాబా ఆలయాలు



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా కావలి ప్రాంతంలోని షిర్డీ సాయిబాబా ఆలయాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు, అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. భక్తులు పాల్గొని షిర్డీ సాయిబాబాను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. కావలి పట్టణంలోని నందదీప్ సాయిసమాజ్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆలయ బాధ్యులు తంగుటూరి శివప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కావలి శివాలయం పక్కన వున్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, అన్నప్రసాత వితరణలు జరిగాయి. భక్తులు బారులుగా తీరి షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**వరికుంటపాడు, జులై 21, ప్రభాతవార్త:** గురుపౌర్ణమిని పురష్కరించుకొని స్థానిక శ్రీషిరిడి సాయిబాబ మందిరంనందు అత్యంత వైభవంగ వేడుకలను నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి, సుజన దంపతుల ఆద్వర్యంలో సాయినాదునికి ఆదివారం వివిద రకాలపంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమాలు నిర్వహించా ప్రత్యేకంగ స్వామివారిని అలంకరించి పూజలు చేశారు. కాగడ హారతి, పాదస్పర్శ దర్శనం కార్యమ్రాలతో పూజలు చేశారు . అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక వాహనంపై అలంకరించి గ్రామోత్సవం మేళతాళాల మద్య నిర్వహించారు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి పూజలలో పాల్గొన్నారు. చుట్టుప్రక్కల గ్రామాలనుంచికూడ మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పూజలలో పాలు పంచుకున్నారు. ఈపూజా కార్యక్రమాలను అర్చకులు కార్మిక్‌తేజలు నిర్వహించారు.










## పేద వృద్దులకు 60 వేల రూపాయల నిత్యావసర సరుకులు పంపిణీ



**కావలి, జులై 21 ప్రభాతవార్త :** కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని డిఆర్ విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది పేద వృద్దులకు డిఆర్ పేరు మీద 60 వేల రూపాయల విలువ చేసే బియ్యం, వంటింటి సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. విశ్వోదయలో తాను విద్యతో పాటు సేవాభావం, సంస్కారం నేర్చుకున్నానన్నారు. తల్లిదండ్రులను వారి పిల్లలు చూడకపోతే న్యాయస్థానం భరణం ఇప్పిస్తుందన్నారు. అలా ఎవరైనా కోరితే తాను సహాయపడతానన్నారు. విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు దొడ్ల రామచంద్రారెడ్డి గొప్ప దార్శనీకుడని, విద్యాప్రదాత అని కొనియాడారు. డాక్టర్ డిఆర్ సమాజానికి చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. ఆయన స్ఫూర్తితో కళాశాలలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన కుమారులు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధరకుమార్‌రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలలో విద్యార్థులను కూడా భాగస్వామ్యులు చేస్తూ సామాజిక స్పృహ, సేవాభావం వారిలో నింపడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ కింగ్, రంగనాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.